# స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బల్దియా ప్రత్యేక దృష్టి



కరీంనగర్ బల్దియా కార్యాలయం

- నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా అధికారుల చర్యలు
- ఇంటింటా చెత్త సేకరణ, నగర సుందరీకరణ పనులు
- నగరంలో ముగిసిన కేంద్ర బృందం క్షేత్ర పర్యటన

కార్పొరేషన్, డిసెంబర్ 7: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో కరీంనగర్ నగరపాలక సంస్థ మెరుగైన ర్యాంక్ వచ్చేలా అనేక కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా నగరంలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలకు సంబంధించి కేంద్ర బృందాలు అన్ని మున్సిపాలిటీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. గతంలో కంటే ఈసారి మెరుగైన ర్యాంకు సాధించే దిశగా కరీంనగర్ నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. అత్యధిక మార్కులు వచ్చేలా ప్రజాభిప్రాయ సేకరణపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో 6 వేల మార్కులు ఉండగా, వీటిలో ప్రజల అభిప్రాయాలకే 1800 మార్కులు కేటాయించారు. దీంతో పారిశుధ్య పనులకు ఆధునిక యంత్రాలను వినియోగించడంతో పాటు ఇంటింటా చెత్తను సేకరించేందుకు ప్రస్తుతం ఉన్న రిక్షాల స్థానంలో స్వచ్ఛ ఆటోలను తీసుకువచ్చారు. వీటిలో ముఖ్యంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంతో పాటు రీసైక్లింగ్ చేస్తున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. నగరంలో అనేక ఇండ్లల్లో హోం కంపోస్టు కేంద్రాలను ఏర్పాటు చేసి అవి వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. అలాగే, నగరంలోని చౌరస్తాలను సుందరీకరణ చేశారు. డివిజన్లలోని అంతర్గత రోడ్లు పరిశుభ్రంగా ఉంచారు. వీటన్నింటి ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ఈసారి మెరుగైన ర్యాంకు వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### *క్షేత్రస్థాయిలో పర్యటించిన కేంద్ర బృందం*

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీకి సంబంధించి పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ, డంప్ యార్డు, మరుగుదొడ్ల నిర్వహణ, ఆధునిక యంత్రాల వినియోగం, తదితర విషయాలను కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పోటీలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులు నగరంలో ఇటీవల 20 రోజుల పాటు పర్యటించి వివిధ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం నగరపాలక సంస్థ అధికారులు పంపించిన వివరాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయో లేదో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈసారి కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో కరీంనగర్‌కు ఏ ర్యాంక్ వస్తుందోనన్న ఆసక్తి నెలకొన్నది.

# కిమ్స్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ తయారు చేస్తున్న కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 7: జిల్లా కేంద్రంలోని కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ముందస్తు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు హాజరయ్యారు. విద్యార్థులు ఆల్కహాల్, డ్రై ఫ్రూట్స్‌తో కేక్, ఇతర తినుబండారాలు తయారు చేయగా అభినందించి, మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అనూశ్ రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాలలో చదివిన 125 మందికిపైగా విద్యార్థులు వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ శాలిని, సహజ, అధ్యాపకులు హరీశ్, యశ్వంత్, మనోజ్, సృజన, రజిత, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరైన భక్తులు



పూజలు చేస్తున్న వేదపండితుడు కాసుల చంద్రశేఖర శాస్త్రి, అర్చకులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 7: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వేదపండితుడు కాసుల చంద్రశేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో గ్రామ పురోహితుడు దేవరాజు ప్రశాంత్ శర్మ వైభవంగా నిర్వహించారు. రేణుకాదేవీ, మల్లికార్జున స్వామి, ఆంజనేయ స్వామి, నాగదేవత, నవగ్రహ, ధ్వజ స్తంభ శిఖర ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాశవేణి భూమయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు కూకట్ల రాజయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, లచ్చయ్య, శ్రీనివాస్, మల్లయ్య యాదవ్, మల్లేశ్‌యాదవ్, అంజిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అభినందన

కొత్తపల్లి, డిసెంబర్ 7: ఢిల్లీలో ఈనెల 9 నుంచి 10వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు కరీంనగర్‌లోని దమ్మిక కాయ్ షిటో ర్యూ కరాటే అకాడమీ క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ స్టేట్ చీఫ్ ఆర్ ప్రసన్నకృష్ణ తెలిపారు. అండర్-12 విభాగంలో శ్రుతిక్ నందన్, శివ ధనుష్, అండర్-14 విభాగంలో ఎం మణితేజ, మధుశ్రీ, అఖిరా, కుమిటీ విభాగంలో రాంచరణ్ ఎంపికయ్యారు. క్రీడాకారులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.



రంగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

# కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే గంగుల పరామర్శ

కార్పొరేషన్, డిసెంబర్ 7: కరీంనగర్ 2వ డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య-శ్రీనివాస్‌ను గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. కాశెట్టి శ్రీనివాస్ తల్లి రంగమ్మ ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగమ్మ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్‌కు సత్కారం



రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

రాంనగర్, డిసెంబర్ 7: కరీంనగర్ కమిషనరేట్‌లోని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రఘునాథ్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. విధుల పట్ల అంకిత భావంతో పని చేసి, ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందినందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ప్రత్యేకంగా అభినందించారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఐదు వేల రూపాయల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, రజినీకాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

కొత్తపల్లి, డిసెంబర్ 7: నగరంలోని కోరా ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ దుర్గరాజు పేర్కొన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు సాయి శ్రీజ, సాయి శరణ్య, శ్రీహిత అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్ రెడ్డి అభినందించారు.

## గుండెపోటుతో వలస కూలీ మృతి

రాంనగర్, డిసెంబర్ 7: నగరంలోని కట్టరాంపూర్‌లో స్మార్ట్ సిటీ పనులు చేసేందుకు వచ్చిన వలస కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబాబు (39) స్మార్ట్ సిటీ పనులు చేసేందుకు వచ్చి టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పిగా ఉందని సహచరులకు తెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రాంబాబు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొన్న లారీ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 7: నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో గల హనుమాన్ ఆలయ సమీపంలో ఓ లారీ కారును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌లో గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి పట్టాలను తీసుకెళ్తున్న లారీ అల్గునూర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద కారును తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో లారీ ముందు భాగం ధ్వంసం కాగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు డ్రైవర్ రామ్‌కుమార్ వర్మను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి దవాఖానకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.